క్లుప్తంగా

మల్లేశ్వరస్వామికి అభిషేకాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కార్తిక మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామివారికి పంచామృత అభిషేకాలు, అర్చనలు జరిగాయి. తెల్లవారుజామున స్వామివారికి భక్తులు పంచామృతాలతో అభిషేకాలు జరిపించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో సహస్ర లింగార్చన జరిగింది. ఆలయ అర్చకులు సహస్ర లింగాలకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించిన అనంతరం స్వామివారిని విశేషంగా అలంకరించారు. సాయంత్రం మల్లేశ్వర స్వామివారి ఆలయం, అమ్మవారి ప్రధాన ఆలయం, నటరాజ స్వామి వారి ఆలయం వద్ద ఆకాశ దీపాలను వెలిగించారు. స్వామివారి సన్నిధిలో సహస్ర దీపాలంకరణ సేవ, ఊంజల్ సేవ నిర్వహించగా, ఆలయ అర్చకులు, ఉభయదాతలు, భక్తులు సేవలో పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన సత్యకృష్ణ కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి సన్నిధిలోని ధర్మపథం వేదికపై టి.సాయికృష్ణ శిష్య బృందం పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన ఇచ్చింది. సత్యానందిని, హేమ, శ్రీకావ్య, అనీషా, కాత్యాయని, క్వాతి, శైలజ, యషిక, గుణ సహస్ర, భావనలు నృత్య ప్రదర్శన చేశారు. నృత్య ప్రదర్శనలో పాల్గొన్న చిన్నారులకు ఆలయ ఈవో కెఎస్.రామరావు, డీఈవో రత్నరాజు అభినందనలు తెలిపి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం శిష్య బృందానికి అమ్మవారి దర్శనం కల్పించారు.

అన్నదానం చేయటం పూర్వజన్మ సుకృతం



భవానీపురం(విజయవాడపశ్చిమ): అన్నిదానాల్లో అన్నదానం గొప్పదని, అటువంటి కార్యక్రమాన్ని చేపట్టటం పూర్వజన్మ సుకృతం వలనే సాధ్యమవుతుందని శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామరావు పేర్కొన్నారు. గొల్లపూడిలోని శ్రీఅయ్యప్ప దేవస్థానం ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు నెలలపాటు స్వాములకు నిర్వహించనున్న అన్నదాన కార్యక్రమాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. తొలుత ఆయన అన్నదాన కార్యక్రమం కన్వీనర్, కేబీఎన్ కాలేజీ సెక్రటరీ తూనుగుంట్ల శ్రీనివాసరావుతో కలిసి అయ్యప్ప స్వామిని దర్శించుకున్నారు. అనంతరం వారు అయ్యప్ప స్వామికి సమర్పించిన మహా నివేదన పూజ కార్యక్రమంలో పాల్గొని అన్నదానానికి శ్రీకారం చుట్టారు. అయ్యప్ప స్వామి ఆలయ ధర్మకర్త గెల్లి మోహన్‌రావు పాల్గొన్నారు.

జాతీయ ఫార్మసీ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగరంలోని కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మసీ కళాశాలలో ఈ నెల 18 నుంచి 23వ తేదీ వరకు 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలను నిర్వహించనున్నారు. వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సునీత ఆవిష్కరించారు. ఈ ఏడాది థింక్ హెల్త్ – థింక్ ఫార్మసీ అనే నినాదంతో ఫార్మసీ వారోత్సవాలు చేపడుతున్నామన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో తప్పని కష్టాలు

- లేబర్‌కాలనీలో అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ
- ఏళ్ల తరబడి కచ్చా డ్రెయినే దిక్కు
- అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణానికి మీనమేషాలు
- ఇళ్లలో నిల్వ ఉంటున్న మురుగు



లేబర్‌కాలనీలోని కచ్చా డ్రెయిన్



బైపాస్ రోడ్‌లోని డ్రెయిన్ వద్ద నిలిచిపోయిన మురుగు



ఓ ఇంటిలోకి చేరిన మురుగు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం లేబర్‌కాలనీవాసులకు శాపంగా మారింది. సైడు కాలువల్లోని మురుగు నీరు ముందుకు కదలదు. కాలువలు నిండిపోయి ఇంటి వాకిట్లోకి వచ్చేసి రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్నా పట్టించుకునే నాథుడే లేరు. ఏళ్ల తరబడి ఉన్న కచ్చా డ్రెయిన్ స్థానంలో పక్కా అవుట్‌ఫాల్ డ్రెయిన్ నిర్మాణానికి మీనమేషాలు లెక్కిస్తున్న మున్సిపల్ అధికారులపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యాధరపురం 44వ డివిజన్ పరిధిలోని లేబర్‌కాలనీలో గల ఆరు బిల్డింగ్‌ల ముందున్న సైడు కాలువలన్నీ నిండిపోయి ఉన్నాయి. అవి ముందుకు వెళ్లాలంటే అక్కడ ఉన్న వెడల్పాటి కచ్చా డ్రెయిన్‌లోని మురుగు నీరు కదిలితే కాలువల్లోని నీళ్లు పారుతుంది. ఆరు బిల్డింగ్‌ల ముందున్న మెయిన్ రోడ్‌పై ఉన్న బాక్స్ కల్వర్టుకు సమాంతరంగా కచ్చా డ్రెయిన్‌లోని మురుగు నీరు ఎక్కడిదక్కడే నిలిచి పోవడంతోనే తమకు అవస్థలు తప్పడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ పరిస్థితి ఇలా ఉండగానే ఇటీవల సంభవించిన బుడమేరు వరద కారణంగా ఆరు బిల్డింగ్‌ల ప్రాంతంలో నడుం లోతు వరద నీటితో మునిగిపోయింది. వరద ఉధృతికి అన్నా కచ్చా డ్రెయిన్‌లోని చెత్తాచెదారం, లోపల సిల్ట్ కొట్టుకుపోయి పరిస్థితులు చక్కబడతాయని ఆశించిన కాలనీవాసుల ఆశలు నిరాశగానే మిగిలిపోయాయి.

మురుగు పారుదలకు ఆటంకాలెన్నో..

కచ్చా డ్రెయిన్‌లోని మురుగు నీరు ముందుకు సాగుతూ కాలనీలోని జీఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్ వెనుక నుంచి ఏర్పాటు చేసిన సిమెంట్ పైపుల ద్వారా స్టేడియం స్థలం చివరి వరకు వెళ్లి అక్కడ ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్‌లోకి చేరాలి. అక్కడి నుంచి కుడివైపుగా వెళ్లి సితార జంక్షన్ మూల మీదున్న అవుట్‌ఫాల్ డ్రెయిన్ ద్వారా కబేళా రోడ్‌లోని డ్రెయిన్‌లో కలవాల్సి ఉంటుంది. అయితే ఇంత సుదీర్ఘ ప్రయాణంలో మురుగు నీటి పారుదలకు అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయి. బైపాస్ రహదారి పక్కన ఉన్న అవుట్‌ఫాల్ డ్రెయిన్‌పై వ్యాపారస్తులు భారీగా కట్టిన సిమెంట్ చప్టాలే అందుకు కారణభూతంగా నిలుస్తున్నాయి. వ్యాపారస్తులు నిర్మించిన చప్టాల మధ్యలో అక్కడక్కడ డ్రెయిన్ శుభ్రం చేసేందుకు జల్లెడ వంటి ఏర్పాట్లు చేసినప్పటికీ అవి నామమాత్రంగానే మిగిలిపోయాయి. చప్టాల కింద చెత్తాచెదారం పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో మురుగు నీటి పారుదల సక్రమంగా సాగటం లేదన్నది స్పష్టమవుతుంది. కాగా సైడు కాలువలు నిండిపోయి మురుగు నీరు ఇంటి ఆవరణలోకి వచ్చేయడంతో ఆ ఇంటి యజమాని ఖాళీ చేసి కాలనీలోనే మరో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు.

విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఎమ్మెల్యే..

పశ్చిమ నియోజకవర్గాన్ని ఎవరూ ఊహించని రీతిలో అభివృద్ధి చేస్తానని ఎన్నికల ముందు ఊదరగొట్టిన ఎమ్మెల్యే గెలిచాక నియోకవర్గానికి విజిటింగ్ ప్రొఫెసర్‌గా తయారయ్యారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ చేసే సుజనా చౌదరికి పశ్చిమ నియోజకవర్గం ఒక గల్లీ లాంటిదని, అటువంటి ప్రాంతం అభివృద్ధిపై ఏం దృష్టి పెడతారని ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. నియోజకవర్గంలోని కార్పొరేటర్లందరినీ(పార్టీలకు అతీతంగా) సమన్వయం చేసుకుని సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన ఆయన కేవలం పార్టీలు మారిన జంప్ జిలానీలతో మాత్రమే సమావేశం ఏర్పాటు చేసి 'మీరు సమస్య చెప్పండి..నేను పరిష్కరింప చేస్తాను' అని చెప్పటం హాస్యాస్పదంగా ఉందని నియోజకవర్గ ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. కార్పొరేటర్ల స్థాయిలో చేయగలిగిన పనులుంటే వారికే చెబుతాం కదా.. ఎమ్మెల్యే నియోజకవర్గంలో పర్యటిస్తే ఆయన స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను చెప్పుకోవడానికి వీలు ఉంటుందని ప్రజలు వాపోతున్నారు. అంతేగానీ ఎమ్మెల్యే కార్యాలయం చుట్టూ తిరుగుతూ కార్యాలయ కార్యదర్శిని కలిసి చెప్పుకోవాల్సి వస్తే ఇక ఎమ్మెల్యే ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

బాలల జీవనశైలిపై సోషల్ మీడియా తీవ్ర ప్రభావం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బాలల జీవనశైలిపై సోషల్ మీడియా తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుందని నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కోఆర్డినేటర్ జాకబ్ రాజు అన్నారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలను పురస్కరించుకొని నగరంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శనివారం 'బాలలపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జాకబ్‌రాజు మాట్లాడుతూ అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఈ నెల 20వ తేదీ వరకు ఉపన్యాసం, చిత్రలేఖనం, వ్యాసరచన, పాటలు, నాటిక ప్రదర్శన పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. నేడు ప్రతి ఇంట్లో దాదాపు 18 ఏళ్లలోపు పిల్లలకు స్మార్ట్ ఫోన్లు సర్వసాధారణంగా మారిపోయాయన్నారు. కానీ కొంత మంది పిల్లలు ఫోన్లకు బానిసలవుతున్నారని చెప్పారు. దానివలన వారి తల్లిదండ్రులు పిల్లలను నియంత్రించలేక ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ఫోన్లలో కొత్త వారిని నమ్మి వారి వలలో చిక్కుకుంటున్నారన్నారు. ఫోన్ల అధిక వినియోగం వల్ల పిల్లల్లో మానసిక సమస్యలు తలెత్తుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.రూతమ్మ, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి సేవా కార్యక్రమాలు దోహదం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సమాజాభివృద్ధికి సేవా కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని, అటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్స్ ఎల్లప్పుడు ముందంజలో ఉండటం అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్స్ నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం శనివారం కేఎల్‌రావునగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్‌లోని సెమిస్టర్ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లింగం శివశంకర్, దామర్ల శ్రీకాంతి, దేవినేని కిషోర్, వీవీపీఎస్ ఆంజనేయులు, అన్న కుసుమ, మేడ పూర్ణచంద్రరావు, డాక్టర్ ఎం.రవీంద్రనాథ్‌లు హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన అనంతరం నూతన కమిటీ అధ్యక్షుడిగా నమ్మి అప్పారావు, కార్యదర్శిగా వేముల వెంకట్రావు, కోశాధికారిగా ఎన్‌డీవీ ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా కార్యక్రమాలను సభ్యులు వివరించారు. కార్యక్రమంలో ఎన్వీ రావు, ఎస్.సూర్యారావు, బీఎస్‌కే పట్నాయక్, రాజగిరి సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



విశేష అలంకారంలో అమ్మవారు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): చిట్టినగర్‌లో వేంచేసి ఉన్న శ్రీనగరాల మహాలక్ష్మి అమ్మవారి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తెల్లవారుజామున అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో గణపతి పూజ, కలశస్థాపన చేసి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. ఉత్సవాలను పురస్కరించుకుని మహాచండీ దేవి అలంకారంలో ఉత్సవ మూర్తిని ప్రతిష్ఠించిన అనంతరం అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకులు ప్రసాద్‌శర్మ, రెంటచింతల విశ్వనాథ శాస్త్రి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం అగ్నిప్రతిష్టాపన, లక్ష్మీగణపతి హోమం, కలశ పూజ, అమ్మవారికి పంచహారతుల సేవ జరిగాయి. ఉత్సవాల్లో ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు ఎల్లారాజారావు, గూడెల శ్రీనివాసరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

నీలా సరస్వతీదేవిగా భ్రమరాంబ అమ్మవారు



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం(పాత శివాలయం)లో కొలువైన భ్రమరాంబ అమ్మవారు శనివారం శ్రీ నీలా సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వన్‌టౌన్‌లో పురాతన ఆలయాల్లో ఒకటైన శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో కార్తిక మాసాన్ని పురస్కరించుకొని కార్తిక నక్షత్రదీక్షా మహోత్సవాలను నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పలు ప్రత్యేక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. ఆ క్రమంలో శనివారం భ్రమరాంబ అమ్మవారు శ్రీ నీలా సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామార్చన, కుంకుమార్చనలను నిర్వహించారు. అలాగే శ్రీ మల్లేశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాలింగార్చన తదితర కార్యక్రమాలను వైభవంగా చేపట్టారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నటరాజన్ షణ్ముగం పర్యవేక్షించారు.

నైపుణ్యాలకు పదును పెడితేనే విజయాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నైపుణ్యాలకు పదును పెట్టినప్పుడే అద్భుతమైన విజయాలను సొంతం చేసుకుంటారని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శరవన్‌కుమార్ అన్నారు. ఆ కళాశాల ప్లేస్‌మెంట్ అండ్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో జెన్‌ప్యాక్ట్ సంస్థ ప్రతినిధులు క్యాంపస్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ శరవన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభకు పదును పెట్టేందుకు, వారు వారి రంగాల్లో విజయాలను సాధించేందుకు కళాశాల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంపెనీ హెచ్‌ఆర్‌లు చేతన్, విజయ్‌లు మాట్లాడుతూ.. విద్యార్థుల నూతన సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలన్నారు. భావ వ్యక్తీకరణతో పాటు సృజనాత్మకత వంటి అంశాలను పెంపొందించుకోవాలని సూచించారు.

స్మార్ట్ రోడ్ల నిర్మాణానికి డ్రోన్లతో సర్వే



భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరంలో స్మార్ట్ రోడ్ల నిమిత్తం నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్‌ఎం ధ్యానచంద్ర డ్రోన్లతో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న మూడు సర్కిళ్ల పరిధిలో పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో స్మార్ట్ రోడ్లను 11 ప్రాంతాల్లో 17 కిలోమీటర్ల మేర నిర్మించేందుకు ఈ సర్వే చేపట్టామన్నారు. ఈ రోడ్ సర్వే ద్వారా రోడ్లపై ఉన్న గుంతలు, డివైడర్, పేపర్ బ్లాగ్స్, ఫుట్‌పాత్‌లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పైప్ లైన్లను పరిగణనలో తీసుకుంటామని తెలిపారు. కేవలం నాణ్యమైన రోడ్లనే కాకుండా పీపీపీ ద్వారా ఆదాయం పెంచే వనరులను కల్పించే విధంగా ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. స్మార్ట్ రోడ్లను నిర్మించటంతో పాటు వాటి నిర్వహణ బాధ్యత కూడా ఏడాదిపాటు ఏజెన్సీదేనని చెప్పారు.

స్మార్ట్ రోడ్ల నిర్మాణం ఎక్కడెక్కడ?

స్మార్ట్ రోడ్లను సర్కిల్–1 పరిధిలో బీఆర్టీ రోడ్, కేటీ రోడ్డు, నెహ్రూ రోడ్డు, కుమ్మరిపాలెం సెంటర్, సితార సెంటర్లలో 7.3 కిలోమీటర్లు, అలాగే సర్కిల్–2 పరిధిలో బీఆర్టీఎస్ రోడ్డు, సాంబమూర్తి రోడ్డు, జీఎస్ రాజు రోడ్డు, కంట్రిక జంక్షన్‌లు 6.2 కిలోమీటర్ల మేర నిర్మించనున్నామని కమిషనర్ ధ్యానచంద్ర వివరించారు. అదే విధంగా సర్కిల్–3 పరిధిలో హెచ్‌టీ లైన్, గురునానక్ కాలనీ మెయిన్ రోడ్, పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్‌లలో 4.14 కిలోమీటర్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సింధూర, అసిస్టెంట్ ఇంజినీర్లు, సచివాలయ సెక్రటరీలు, డ్రోన్ సర్వేలెన్స్ సభ్యులు పాల్గొన్నారు.



అలరించిన సంప్రదాయ నృత్యాలు



నగరంలోని సీతారామపురం ఐకాన్ పబ్లిక్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన సంప్రదాయ నృత్యాలు అలరించాయి. 400 మంది విద్యార్థులు 28 రాష్ట్రాల సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. 40 సెకండ్లలో ఇండియా మ్యాప్ ఆకారంలో విద్యార్థులు ఏర్పడి రికార్డు నెలకొల్పారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



విజేతలతో ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ భవానీ, హెచ్‌ఎం నాగలక్ష్మి

భవానీపురం(విజయవాడపశ్చిమ): బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో గొల్లపూడిలోని పోసాని నరసింహరావు చౌదరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు 'మాదక ద్రవ్యాలు – ఆరోగ్యంపై ప్రభావం' అనే అంశంపై శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భవానీపురం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ పి.భవానీ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల మత్తులో జీవితాన్ని పాడుచేసుకోవద్దని హితవు చెప్పారు. గంజాయి, బ్రౌన్ షుగర్, హెరాయిన్, కొకైన్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై కొంత మంది యువకులు తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాత్కాలిక ఆనందం కోసం విద్యార్థులు నూరేళ్ల జీవితంలోని వెలుగులను అంధకారం చేసుకుంటున్నారన్నారు.

టోల్ ఫ్రీ నంబర్ 14500

డ్రగ్స్ నేరుగా మెదడు, కేంద్ర నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతాయని తెలిపారు. శరీరంలోని ప్రధాన అవయవాలైన గుండె, లివర్, ఊపిరితిత్తుల పనితీరు మందగించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అక్రమ మద్యం, నాటు సారా, మాదక ద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు అందించాలని కోరారు. అలాగే టోల్ ఫ్రీ నెంబర్ 14500కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. వ్యాసరచన పోటీలో రాజేశ్వరి, పవన్ కుమార్, వెంకటేశ్వరరావులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగలక్ష్మి, నీ తోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో ఆర్డినేటర్ కె.ప్రియాంక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● బాలోత్సవం అదరహో..





స్థానిక సిద్ధార్థ ఆడిటోరియంలో జరుగుతున్న 7వ అమరావతి బాలోత్సవం ఉత్సాహ భరిత వాతావరణంలో కొనసాగుతోంది. వేడుకల్లో భాగంగా శనివారం జానపద నృత్యం, తెలుగు పద్యాలు, శాస్త్రీయ నృత్యం, జానపద గీతాలాపన, దేశభక్తి, అభ్యుదయ గీతాలాపన, ఇంగ్లిష్ రైమ్స్, డ్రాయింగ్, బెస్ట్ ఫ్రమ్ వేస్ట్, షార్ట్ ఫిల్మ్ విశ్లేషణ, దినపత్రికా పఠనం, కథా విశ్లేషణ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని అదరహో అనిపించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





బుద్ధా వెంకన్నా.. స్థాయి తెలుసుకుని మాట్లాడు

కాపు సామాజికవర్గ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): టీడీపీలో ఎటువంటి పదవి లేక ప్రెస్‌మీట్లకే పరిమితమైన రాజకీయ నిరుద్యోగి బుద్ధా వెంకన్న స్థాయి తెలుసుకుని మాట్లాడాలని కాపు సామాజికవర్గ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్, బేతు రామ మోహన్, సుంకర శ్రీనివాసరావు,అల్లం పూర్ణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం సీఎం చంద్రబాబుకు ఇటీవల రాసిన బహిరంగ లేఖపై వెంకన్న స్థాయిని మరిచి మాట్లాడుతున్నాడన్నారు. కాపు జాతి అభ్యున్నతికి నిలబడ్డ ముద్రగడకు, కాల్‌మనీ వ్యాపారంతో పేదలను దోచుకున్న నీకు పోలికా అని ప్రశ్నించారు. రాజకీయ నాయకులుగా తాత, తండ్రి చేసిన ప్రజా సేవలకు వారసుడిగా రాజకీయాల్లో చేరి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఒక సారి ఎంపీగా, రెండు పర్యాయాలు మంత్రిగా పని చేసిన ముద్రగడను విమర్శించే అర్హత వెంకన్నకు లేదని స్పష్టం చేశారు. కాపు ఉద్యమ నేతగా గుర్తింపు పొందిన ముద్రగడ ప్రజా సేవలో తన ఆస్తులను పోగొట్టుకున్నారని గుర్తు చేశారు. ఇకపై అటువంటి వ్యక్తిపై అవాకులు చవాకులు పేలితే చూస్తూ ఊరుకోమని, తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. రాజకీయ లబ్ధి కోసం ఎంత నీచానికైనా ఒడికట్టే బుద్ధా వెంకన్న తన నైజాన్ని మార్చుకుని బుద్ధిగా మసలుకోవాలని హితవు పలికారు.